www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 22 మే 2023
5
తూర్పుగోదావరి



నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో 3000 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్దేశించినట్టు జిల్లా సూక్ష్మ సేద్యం, ఎపిఎంఐపి అధికారి ఎస్.రామ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన 11 డ్రిప్ కంపెనీల్లో, డ్రిప్ పరికరాలు అమర్చేందుకు ఫిట్టర్స్ కొరత ఉన్నందున నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు నిండిన ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ లోగా జిల్లా సూక్ష్మసేద్య అధికారి, వైటిసి. బిల్డింగ్, రూరల్ తహశీల్దార్ కార్యాలయం ప్రక్కన, బొమ్మూరు, రాజమహేంద్రవరం కార్యాలయానికి పోస్ట్ ద్వారా గాని, 7995009886/85 ఫోన్ నెంబర్లకు చేసి దరఖాస్తు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల మెడపై కత్తి

- లక్ష్యం చేరకుంటే వేతనం నిల్
- ఆందోళనలో ఉపాధి సిబ్బంది



పెరవలిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం అమలులో క్షేత్రస్థాయిలో కీలకంగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల మెడపై కత్తి వేలాడుతోంది. సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు దశల వారీ పోరాటాలు చేసినా అధికార యంత్రాంగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పని దినాలతో సంబంధం లేకుండా వేతనం ఇవ్వడం తోపాటు, జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కరోనా తరువాత పరిస్థితి సాధారణ స్థితికి వచ్చి, నెమ్మదిగా పనులు ప్రారంభమైనా ఇప్పటికీ కనీస భరోసా కల్పించలేదు. తాజాగా పని దినాల ఆధారంగానే జీతాలు ఇస్తుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గతంలో 910 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండేవారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లక్ష్యాలను చేరుకోవటంలో వెనుకపడుతూ వచ్చారు. ఈ విధంగా దశల వారీగా 350మంది సీనియర్ మేట్లుగా మిగిలిపోయారు. ఇదే విధానం అమలు చేస్తే రానున్న రోజుల్లో పూర్తిగా ఉపాధికి దూరమవుతారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో టార్గెట్లను ఉపసంహరించుకుని ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం నెలకు రూ.26000 అమలు చేయాలనే డిమాండ్ ముందుకొస్తోంది.

అందని ద్రాక్షలా టార్గెట్లు

ఏడాదిలో గ్రామంలో 7,500 పని దినాలు కల్పించిన వారిని ఎ గ్రేడ్ కింద చేర్చి వారికి నెలకు రూ.8,900 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 7,500–6,500 మధ్య పని దినాలు కల్పించిన వారిని బి గ్రేడ్‌గా పరిగణించి రూ.7,900 వేతనం, రూ.350 అలవెన్స్‌లు, 5,000 నుంచి 6,500 మధ్య పనిదినాలు కల్పించిన వారిని సి గ్రేడ్‌గా పరిగణించి రూ.6,400 వేతనం, రూ.350 అలవెన్స్ ఇస్తున్నారు. 5,000 కంటే తక్కువ పని దినాలు కల్పించిన వారికి జీతాలు ఉండవు. కరోనా కారణంగా విధించిన లాక్‌డౌన్ ఫలితంగానూ, పట్టణాలు, నగర పంచాయతీల్లో కొన్ని గ్రామాలను విలీనం చేయడంతోనూ గతంలో ప్రభావం పడిందని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. ఎ గ్రేడ్, బి గ్రేడ్, సి గ్రేడ్ కోటాలో కొందరికి మాత్రమే జీతాలు చెల్లించి మిగిలిన వారికి మొండిచేయి చూపిస్తూ పొమ్మన కుండా పొగబెడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరుతున్నారు.

మూడు నాలుగు నెలలే పనులు..

ఉపాధి హామీ పనులు ఏడాదంతా సాగటం లేదు. వేసవిలో మూడు నుంచి నాలుగు నెలలు మించి పనులు జరగటం లేదు. ఫిబ్రవరి, మే వరకే కాస్త హడావిడి కనిపిస్తోంది. మిగతా రోజుల్లో వ్యవసాయ పనులు ఉన్నందున ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. గత రెండేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో రెండేళ్లుగా వ్యవసాయ పనుల్లో జనం బిజీగా ఉంటుండటంతోనూ ఉపాధి పనులు పెద్దగా సాగడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేతనం రూ.272 ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో 200 మించి రావటంలేదు. దీనికి పలు సాంకేతిక కారణాలు అడ్డంకిగా ఉన్నాయి. పట్టణాల్లో కూలీలకు కనీసంగా సగటున రోజు కూలీ రూ.600 వరకూ చెల్లించే అవకాశం ఉంది. దీంతో అత్యధిక మంది పట్టణాలలో అడ్డాకూలీలుగా తరలివెళుతున్నారు. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరుతున్నారు. కూలీలకు వేతనం పెంచి ఇస్తే ఉపాధి పనులకు ఆసక్తి చూపిస్తారని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



ప్రభుత్వ నిబంధనలతో ఈ రంగంలో పని చేసే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. టార్గెట్ల విధానం రద్దు చేయాలి. కనీస వేతనం నెలకు రూ.26,000 చెల్లించాలి. ఫోన్, స్టేషనరీ ఇతరాత్ర అలవెన్స్‌లు కలుపుకుని ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.9000కు మించి వేతనం రావటంలేదు. టార్గెట్ రీచ్ కాని ఫీల్డ్ అసిస్టెంట్లు మేట్లుగా మిగిలిపోతున్నారు. దశాబ్ద కాలంగా చేసిన సీనియారిటీ రద్దు అవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలి. 15 ఏళ్లుగా ఈ రంగంలో పని చేస్తున్న వారిని సచివాలయ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి.

- మేడిది పరంధామయ్య,
రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎపి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి



సిఎం పర్యటనా ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మే 24 పర్యటన విజయవంతం చేయడంలో సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఇతర అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మంత్రి వనిత పరిశీలించారు. సభాస్థలం, అక్కడ ఏర్పాటు చేస్తున్న గ్యాలరీలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా తగినంత తాగునీరు ఏర్పాటు చెయ్యాలని, సుమారు 2.1 కిలోమీటర్ల మేర రోడ్ షో లో ప్రజలకు అభివాదం చేస్తూ కొవ్వూరు పట్టణంలో సిఎం పర్యటన చేయనున్న దృష్ట్యా అత్యంత జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి తొలిసారిగా కొవ్వూరు నియోజకవర్గం రానున్న దృష్ట్యా పెద్ద ఎత్తున ప్రజలు, స్థానిక నాయకులు తరలి వస్తారని అందుకు అనుగుణంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా పాల్గొనే అవకాశం ఉందని ఆ మేరకు తగిన ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు అధికారులు వివరించారు. కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వివిధ శాఖల అధికారులకు సంబంధించి విధులను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేశామన్నారు. రోడ్ షో మేరకు బ్యారికేడ్లు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ కోసం ఆయా మార్గాలలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రహదారి పొడవునా ఎక్కడా ఎటువంటి బ్లాక్ హోల్స్ లేకుండా చూడాలని, రోడ్‌కు ఇరువైపులా బ్యారికేడ్స్ ఏర్పాటు చెయ్యాలని సూచించారు. మెడికల్ క్యాంపులు రోడ్ షో, సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చెయ్యాలని, అంబులెన్స్ సేవలు కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెలిప్యాడ్ నుంచి సత్యవతి నగర్‌లోని సభాస్థలి వరకు రోడ్ షో మార్గంలో ఉన్న రూట్‌లో హోమ్ మంత్రి కాన్వాయ్ ద్వారా మంత్రి, కలెక్టర్, ఇతర అధికారులు ట్రైల్ రన్ నిర్వహించారు. ఈ సందర్శనలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, ఆర్ఎంసి మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, పోలీసు అధికారులు, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

23న కలెక్టరేట్‌లో మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23నఉదయం 9.00 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండల రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ డెల్టాహాస్పిటల్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్, మోహన్ స్పిన్ టెక్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సంస్థల్లోని వివిధ ఉద్యోగాల్లో పని చేసేందుకు ఏదైనా డిగ్రీతో పాటుగా కంప్యూటర్ నైపుణ్యాలు కలిగిన వారు, బిఎస్‌సి నర్సింగ్, జిఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసిన, ఇంటర్ పాసైన వారు, 7వ తరగతి నుండి పై చదువులు చదివిన వారు 19 నుంచి 39 ఏళ్ల వయస్సు గల వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఆయా కంపెనీలు వారి అనుభవాన్ని బట్టి వేతనం ఇస్తారని పేర్కొన్నారు. మినీ జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా ఆ ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి, తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా తమ పూర్తి వివరాలతో https://tinyurl.com/egmjb ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. లేదా నేరుగా వేదిక వద్ద రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. మినీ జాబ్ మేళాకు రెజ్యూమేతో పాటు ఆధార్, పాన్ తదిర సర్టిఫికెట్లు, జిరాక్సు కాపీలతో ఈ నెల 23న ఉదయం 9.00 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం (బొమ్మూరు హార్లిక్స్ ప్యాక్టరీ ఎదురుగా) గల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ వద్దకు రావాలని మరిన్ని వివరాలకు 9133912947, 9581810049 నెంబర్లలో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.



గాలుకు విరిగిన అరటి తోట

నేలకొరిగిన అరటి మొక్కలు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ముక్కామల గ్రామంలో అరటి తోటలు శనివారం సాయంత్రం ఈదురు గాలులు, జోరువానకు విరిగిపోయాయి. సుమారు 150 ఎకరాల్లో గెలలు వేసినవి, గెలలు వేయటానికి సిద్ధంగా ఉన్నవి మొక్క తోటలు చాలామేరకు దెబ్బ తిన్నాయి. సన్న చిన్న కారు, కౌలు రైతులు అరటి పంటలు పూర్తిగా నష్టం పోయారు. కౌలు రైతు బొబ్బిలి సత్తియ్యకు చెందిన నాలుగు ఎకరాల 90 సెంట్ల అరటి తోట ఈదురు గాలికి విరిగిపోయింది. అధికారులు పంట నష్టం అంచనా వేసి పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన



శిక్షణ తరగతిలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం దూబచర్లలో స్థానిక సంఘమిత్ర విద్యాలయలో లయన్స్ క్లబ్ దూబచర్ల, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత యోగ, చెస్, వేసవి శిక్షణ తరగతులను ఆదివారం జిల్లా స్పోర్ట్స్ ఛీఫ్ కోచ్ శేషగిరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణా తరగతులు విద్యార్థుల్లో శారీరక, మానసిక నైపుణ్యం పెంపుదలకు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. ఈ మధ్యకాలంలో స్పోర్ట్స్ పట్ల యువత ఆసక్తి చూపుతోందని దానివల్ల ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా దూబచర్ల వాసవి క్లబ్ అధ్యక్షులు వంకదార గుప్తా, క్లబ్ సభ్యులు 10 యోగా మేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన విద్యార్థులు యోగాసనాలు వేసి అలరించారు. ఈ కార్యక్రమం పరిశీలకులుగా వచ్చిన చీఫ్ కోచ్ శేషగిరిరావుని యోగాసనాచార్యులు, యోగా రాజారావుని క్లబ్ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో భూమా రాజా, సమయమంతుల రాఘవేంద్ర స్వామి, ఈలప్రోలు శ్రీను, వంకదార ఆదిత్య, స్కూల్ అయిడమిక్ డైరెక్టర్ కెల్ల వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వేస శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయంలో వేసవిజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-పెరవలి

మండలం తీపర్రు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 14వ రోజులో భాగంగా ఆదివారం విద్యార్థులచే కథలు చదివించడం చెప్పడం చేశామని రిసోర్స్ పర్సన్ కరుటూరి విశ్వనాథం తెలిపారు. విద్యార్థులకు ఆధ్యాత్మిక విషయాలు, మంచి అలవాట్ల గురించి చెప్పామన్నారు. ధ్యానం యోగ నేర్పించామని తెలిపారు. వివిధ రకాల ఇండోర్ గేమ్స్ ఆడించామన్నారు. విరామ సమయంలో స్నాక్స్ ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మెయిన్ బజార్ బస్టాండ్ ప్రక్కన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద పారా మిలటరీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిల్లి ప్రభాకర్ రావు, మాణిక్యాలరావు, డి.ప్రసాద్, షేక్ సర్దార్ పాషా పాల్గొన్నారు.

జాతరలో ట్రాఫిక్ అంతరాయం

ప్రజాశక్తి- చాగల్లు

మండలంలోని ఊనగట్ల గ్రామ దేవత గోగులమ్మ జాతరలో ఆదివారం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆదివారం ఊరంతా అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకుని భోజనాలు పెట్టుకుంటున్నారు. జాతరకు వచ్చి భోజనం చేసి వెళ్లే వారందరూ అందరూ ఒకేసారి బయలుదేరడంతో ఊరిలో ఒక్కసారిగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఫ్లెక్సీలతో నిండిన ప్రభుత్వ కార్యాలయాలు



ప్రభుత్వ కార్యాలయాల మార్గంలో ఫ్లెక్సీలు

ప్రజాశక్తి-గోపాలపురం

మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఇతర మండల ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలతో నాయకులు నింపేయడంతో పార్టీ కార్యాలయమో, లేక ప్రభుత్వ కార్యాలయాలలో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు ప్రజలు అంటున్నారు. మండలంలోని పలువురు, ప్రజలు, స్థానికులు మాట్లాడుతూ గోపాలపురం ఎంపిడిఒ కార్యాలయంతో పాటు, పిఆర్, ఐసిడిఎస్ ప్రాజెక్టు, సచివాలయం, ఎంఇఒ, హౌసింగ్, చింతలపూడి ఇరిగేషన్, డ్వాక్రా వెలుగు కార్యాలయం, రైతు భరోసా కేంద్రం, ఐకెపి, భవిత పాఠశాల, మండల ప్రభుత్వ కార్యాలయాలతో పాటు మండల పరిషత్ సమావేశపు హాల్లో నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. వీటి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి అన్ని కార్యాలయాలకు ముందుగా రెండు మార్గాలు ఉన్నారు. ఇలా ఎంపిడిఒ కార్యాలయాన్ని ఆనుకుని అనేక ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో మండలంలోని ప్రజలు ఏదో ఒక సమస్యపై కార్యాలయం వద్దకు వస్తున్నారు. వృద్ధులు, చదువు లేని వారు కూడా పలువురిని అడ్రస అడుగుతూ ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం ఏదో ఒక సమస్యపై ప్రభుత్వ కార్యాల యాలకు నిత్యం వస్తుంటారు. గత నెల 23న గోపాల పురంలో నిర్మించిన తహశీల్దార్ కార్యా లయం, సచివాలయ భవనాలను రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ మార్గాని భరత్, ఎంఎల్ఎలు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. వారి రాకను పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయం అంతా ఇలా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలతో నింపేశారు. సుమారు నెల రోజులు అవుతున్నా మండల పరిషత్ కార్యాలయంలో అడుగడుగున కట్టిన ఫ్లెక్సీలు నేటికి తొలగించలేదు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో, బయట వైపు, ప్రభుత్వ కార్యాలయం వద్ద కూడా భారీ ఫ్లెక్సీలతో నింపేశారు. దీంతో అది ప్రభుత్వ కార్యాలయామో లేక వైసిపి కార్యాలయమో తెలియక ప్రజలు తికమకపడుతున్నారు. నిత్యం ఏదో ఒక సమస్యపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారు వైసిపి ఫ్లెక్సీలు చూసి పార్టీ కార్యాలయమేమో అనుకుంటూ తికమక పడుతున్నారు. దీనిపై అక్కడ ఉన్న ప్రభుత్వాధికారులు కూడా నోరు మెదపకపోవడంతో ప్రజలు పడుతున్న అవస్థలు చూసిన వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఎస్‌పితో కలిసి కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా మే 22న ఎస్‌పి సిహెచ్.సుధీర్ కుమార్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం క్షేత్ర స్థాయిలో డివిజన్, మండల, గ్రామ స్థాయి స్పందన కార్యక్రమం యథావిధిగా ఉంటుందన్నారు. రాజమహేంద్ర వరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్‌పితో కలిసి తొలిసారిగా అర్జీలను ప్రజల నుంచి స్వీకరిస్తామన్నారు. ఇకపై ప్రతి నెలా 3వ సోమవారం కలెక్టర్, ఎస్‌పిలు కలెక్టరేట్‌కు హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని చెప్పారు. జిల్లాలోని డివిజన్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ప్రజలు నుంచి సంబంధిత సిబ్బంది స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు తప్పనిసరిగా ఆయా మండలాల నుంచే స్పందనకు హాజరవ్వాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పి, ఇతర జిల్లా అధికారులతో కలిసి ఉదయం 10.00 గంటల నుంచి మధ్నాహ్నం 1.00 గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫిర్యాదులు అందచేయాలని తెలిపారు. మండల స్థాయిలో ప్రత్యేకాధికారి అధికారులు అందరూ మండల కేంద్రంలో ఒకే చోట స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

కుంగ్‌ఫూ పోటీల్లో ఎస్ఎం విద్యార్థుల ప్రతిభ




కుంగ్‌ఫూ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ఎస్ఎం కుంగ్‌ఫూ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఇటీవల శ్రీకాకుళంలో మాస్టర్ సాయిబాబా మెమోరియల్ ఫస్ట్ నేషనల్ కుంగ్‌ఫూ పోటీల్లో ఎస్ఎం విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఈ టోర్నమెంట్‌లో 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 8 మంది గోల్డ్ మెడల్స్, ఐదుగురు సిల్వర్ మెడల్స్, ముగ్గురు బ్రాంజ్ మెడల్స్ సాధించారని కుంగ్ ఫూ మాస్టర్ ఎం,.నాగరాజు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

కార్టూ'నిజం'



ప్రయాణికుల జేబులకు చిల్లు

అధిక ధరలకు విక్రయాలు
ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో షాపుల నిర్వాహకుల తీరు
అధికారుల పర్యవేక్షణ కరువు



ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో దుకాణం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు జేబులకు చిల్లు పడుతోంది. కాంప్లెక్స్‌లోని షాపుల నిర్వహకులు వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రూ.10 విలువ చేసే 500 ఎంఎల్ వాటర్ బాటిల్ రూ.15 చొప్పున అమ్ముతున్నారు. రూ.20 విలువ చేసే ఒక లీటరు వాటర్ బాటిల్ రూ.25 చొప్పున అమ్ముతున్నారు. రూ.38 విలువ చేసే కూల్ డ్రింక్ రూ.50లకు విక్రయిస్తున్నారు. రూ.15 ఎంఆర్‌పి గల లోకల్ డ్రింక్ రూ.25ల చొప్పున అమ్ముతున్నారు. పల్పీ ఆరెంజ్ ఎంఆర్‌పి రూ.20 కాగా రూ.25 చొప్పున అమ్ముతున్నారు. రూ.10 విలువ చేసే నిమ్మసోడా రూ.15 అమ్ముతున్నారు. కాంప్లెక్స్‌లో పల్లె వెలుగు బస్టాండ్‌లో 6, మెయిన్ బస్టాండ్‌లో 12 మొత్తం కలిపి 18 షాపులు ఉన్నాయి. ఈ షాపుల ద్వారా సుమారు రూ.19.49 లక్షల ఆదాయం ఆర్‌టిసిక వస్తోంది. టెండర్ల ద్వారా షాపులు పొందిన వ్యాపారులు నిర్దేశిత కాలపరిమితి అనంతరం తిరిగి టెండర్ల ప్రక్రియలో పాల్గొనాలి. షాపులు కేటాయించే సమయంలో ఆర్‌టిసి అధికారులు ఆ షాపులో ఏరకమైన వ్యాపారం నిర్వహించాలో ముందుగానే తెలియజేసి టెండర్లను స్వీకరిస్తున్నాయి. ఆచరణలో భిన్నమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. వ్యాపారులు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. ఉదాహరణకు కూల్ డ్రింక్స్‌కు పర్మిషన్ తీసుకున్న వారు ఇతరాత్ర వ్యాపారాలు చేయటం, షాపు పరిధి దాటి బస్టాండ్ ఆవరణలో స్టాకు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించేలా అడ్డుగా పెట్టుకోవటం పరిపాటిగా మారింది. ఉదాహరణకు పల్లెవెలుగు బస్టాండ్‌లో కొ స్టాల్‌కు కేవలం కూల్ డ్రింక్స్ అమ్మడానికి పర్మిషన్ ఇచ్చారు కానీ వాటర్ బాటిల్స్, బిస్కట్స్, చిప్స్, బాదంపాలు, బటర్ మిల్క్, లస్సీ, పాప్ కార్న్, సమోసా ఇలా పలు రకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అదే బస్టాండ్‌లో మరో రెండు షాపులు ఒకటి హాట్ చిప్స్, మరొకటి టీస్టాల్‌గా అనుమతి తీసుకున్నారు. కానీ కూల్ డ్రింక్స్, బాదం, బిస్కట్స్, ఫ్రూటీ, యాపిల్ జ్యూస్ ఇలా పలు రకాలు అనధికారికంగా విక్రయిస్తున్నారు. షాపు కూడా 3 అడుగులు ముందుకు జరుపుకుని విక్రయిస్తున్నారు. మరొక స్టాల్‌లో ఫ్రూట్ జ్యూస్ విక్రయించేందుకు అనుమతి తీసుకుని పలు రకాల పానీయాలు అనధికారికంగా అమ్ముతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా పర్యవేక్షించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఎంఆర్‌పి ధరలకు మాత్రమే వ్యాపారులు విక్రయించాలి. లేని పక్షంలో చర్యలు తప్పవు. ప్రయాణికుల నుంచి అధిక ధరలను డిమాండ్ చేస్తే ఆర్‌టిసి అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. కాంప్లెక్స్‌లో షాపులపై ప్రతి వారం పర్యవేక్షణ ఉంటుంది. ఇటీవల ఒక ఫిర్యాదు రావటంతో తనిఖీ చేపట్టాము. నాలుగు లేక ఐదు సార్లు ఫిర్యాదులు వస్తే అనుమతులు రద్దు చేస్తాము.

- షేక్ షబ్నం, డిపో మేనేజర్,
రాజమహేంద్రవరం ఆర్‌టిసి కాంప్లెక్స్.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



గోపాలపురంలో రాజీవ్ నివాళి అర్పిస్తున్న నేతలు

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పలుచోట్ల ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

గోకవరం మండలంలోని అచ్యుతాపురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎపిసిసి ఎస్‌సి విభాగం కన్వీనర్ కొండ శ్రీను మాట్లాడుతూ భారత దేశానిక రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల రత్నాజీ, మాజీ ఎంపిటిసి మాచర్ల పాపారావు, బొల్లం బాబురాజు, రాష్ట్ర బిసి సెల్ కన్వీనర్ కోలపర్తి వీర వెంకటరావు, వేగుపాటి మహేష్ బాబు పాల్గొన్నారు. **గోపాలపురం** దేశంలో సాంకేతిక విప్లవానికి నాడు రాజీవ్ గాంధీ వేసిన మార్గమే కారణమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జ్యేష్ఠ సతీష్ బాబు అన్నారు. చిట్యాల గ్రామంలో రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. గన్నిన రామారాయుడు, అధ్యక్షుడు కౌలూరి రతన్ రాజు, పగడాల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి దాసరి కుటుంబరావు, వేగివాడ నాగేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, గోపాలపురం మండల కాంగ్రెస్ అధ్యక్షులు మట్టపర్తి రామ్మోహన్ రావు పాల్గొన్నారు. **తాళ్లపూడి** పెద్దేవంలో ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయన సుబ్బారావు, కె.శ్రీనివాస్, టి.రామన్న, ఆర్.వీర్రాజు, ఎం.కృష్ణ, ఎన్.పెదకాపు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుకు గురై.. చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - యానాం

పాము కాటుకు గురై చికిత్సపొందుతూ ఆదివారం విద్యార్థి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపారు. ఈ నెల 13న దరియాలతిప్ప బాలయోగి కాలనీకి చెందిన ఆలపాటి సంజయ్ స్థానికంగా ఉన్న సీతారామ నగర్లో సంఘం ప్లాస్టర్ ఆవరణలో తన స్నేహితులతో క్రికెట్ ఆడుతుండగా క్రికెట్ బాలు తేడానికి వెళ్లాడని, అయితే అక్కడే ఉన్న అగ్గిపొద పాము రెండుసార్లు కరిచిందన్నారు. అతనిని చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషతీవ్రత ఎక్కువకావడంతో మెరుగైన చికిత్స అందించినప్పటికీ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని తెలిపారు. సంజయ్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మృతుని తండ్రి శ్రీనివాసరావు కొన్నేళ్ల క్రితం మృతిచెందాడని, తల్లి కుమారి సంరక్షణలో సంజయ్ ఉన్నాడని తెలిపారు. ఎస్ఐ రేఖాడి నాగేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆలపాటి సంజయ్ (ఫైల్)

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని జి.మేడపాడు-బిక్కవోలు స్టేషన్ నడుమ రైల్వే ట్రాక్ వద్ద గుర్తుతెలియని సుమారు 40 ఏళ్ల వయసుగల వ్యక్తి మృతదేహం లభించినట్లు సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపారు. ఆదివారం సాయంత్రం రైల్వే ట్రాక్ పై ఉన్న మృతదేహం సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు. మృతుడు ఐదు అడుగుల ఎత్తు ఉండి, వంటిపై లైట్ గ్రీన్ మీద నలుపు తెలుపు గీతలు గల ఫుల్ హ్యాండ్ షర్ట్, లైట్ స్కై కలర్ టీ షర్టు, గ్రే కలర్ ప్యాంటు, బ్లూ రంగు బెల్టు ధరించి ఉన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కాకినాడ జిఆర్పిఎఫ్ ఓపి ఎస్ఐ ఎస్.రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మురారి గ్రామంలో మోటార్ సైకిల్, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు గండేపల్లి ఎస్ఐ వై.గణేష్కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం గోకవరం పేటలో ఎస్బిఐలో లోన్ ఏజెంట్గా పని చేస్తున్న కొమ్మన సురేష్ మోటార్ సైకిల్పై ఈ నెల 17న తేదీన సాయంత్రం 6:30 గంటకు రాజమండ్రి నుండి మురారి తన పిన్ని గారి ఇంటికి వస్తుండగా అదే సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ అతనికి ఎదురుగా రివర్స్లో తన వాహనాన్ని వేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి మోటార్ సైకిలును ఢీకొనడంతో బైక్పై ఉన్న కొమ్మన సురేష్, అతని స్నేహితుడు జట్ల శ్రీనివాస్కు ఇద్దరికి గాయాలు అయ్యాయి. వారిద్దరూ రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కొమ్మన సురేష్ ఇచ్చిన ఫిర్యాదుపై గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్ ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల పరిధిలోని కాట్రావులపల్లిలో ఆదివారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలోని గోదావరి నదిలో ఈ నెల 19న గల్లంతైన ఇటుకబట్టీ కార్మికుడు ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నారాయణ పట్నానికి చెందిన తంగిడి సోమనా (56) మృతదేహం ఆదివారం లభ్యమైంది. కోరుమిల్లి -కాళ్ల మధ్య గోదావరి నదిలో సోమనా మృతదేహాన్ని గజ ఈతగాళ్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


వెలువలపల్లిలో తాటాకు విసన కర్రలు విక్రయిస్తున్న వ్యక్తి

విసనకర్రలకు పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి - అయినవిల్లి

తరచూ విద్యుత్ కోతలు, దానికి తోడు ఉక్కబోతల నేపథ్యంలో తాటాకు విసినకర్రలకు డిమాండ్ పెరిగింది. అయినవిల్లికి చెందిన వ్యవసాయ కార్మికుడు పనులు లేక తనకు చేతనైన తాటాకులతో విసనకర్రలు తయారుచేసి ఆదివారం మడలంలోని వేలువలపల్లి గ్రామంలోనీ రామాలయం వీధిలో విక్రయించాడు. ఒక్కో విసనకర్ర రూ.20 నుంచి రూ.30 వరకూ పలికింది. హాట్ కేకుల్లా ఇవి సేల్ అయ్యాయి.

నేడు వాలంటీర్లకు వందనం

ప్రజాశక్తి-గోపాలపురం

సోమవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు మండల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

యానాం వార్తలు


లక్ష్మీ స్నేహ, ఆర్ఎఒ మునిస్వామి, సమక్షంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

260 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని స్థానిక జికేర్ హైస్కూల్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ స్కూల్లో లయన్స్ క్లబ్ యానాం పిల్లరాయ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ ఇనోదయ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సతీమణి లక్ష్మీ స్నేహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో పేదలకు సేవలు అందించినట్లే క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పులపర్తి శ్రీను మాట్లాడుతూ క్లబ్ ఏర్పాటైన మొదటి కార్యక్రమంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ వైద్య శిబిరంలో 260 మందికి బిపి, షుగర్, ప్రసూతి, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, గుండె వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. అనంతరం వైద్య సేవలందించిన డాక్టర్లు డిఎన్ఎస్ ప్రకాష్, కె.సత్య సౌజన్య, డివి గురుకిరణ్, నితీష్ సింగ్, ఆర్ సాయి అంజని, శరత్లను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, హెల్త్ అసిస్టెంట్ డైరెక్టర్ వలసకుమార్ సన్నాల్, ఎస్పి రఘునాయుగం, సిఐ షణ్ముగం, చిక్కాల నరసింహారావు, డివిఐ సత్య నారాయణ, దూళిపూడి సతీష్ చంద్ర, నవీన్, గొల్లపల్లి వీర్రాజు, పండు సిద్దార్ధ కుమార్, కాకి నాగేశ్వరరావు, చెక్కల అరుణ్ కుమార్, తిరుమల నాయుడు,భార్గవ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి నివాళి

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులో ఉన్న రాజీవ్గాంధీ విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, ఎస్పి రఘునాయుగం, సిఐ షణ్ముగంలు పూల మాలలు వేసి నివాళు లర్పించారు.


నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి, ఎస్పి రఘునాయిగం

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- మే 24 నుంచి జూన్ 1 వరకు నిర్వహణ
- హాజరు కానున్న 52,571 మంది విద్యార్థులు

ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి నరసింహం

ముఖాముఖి



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్టు ఆర్ఐఒ నరసింహం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 98 కేంద్రాల్లో వీటిని నిర్వహించనున్నారు.

24 నుంచి జూన్1 వరకూ నిర్వహణ

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు నిర్వహించనున్నాము. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవంత్సరం విద్యార్థులకు మధ్యా హ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతరియి. విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు చేరవేసేందుకు ఆయా రూట్లలో ఉదయం 6 గంటల నుంచే ఆర్టిసి బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 52,571 మంది హాజరు

సప్లిమెంటరీ పరీక్షలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 52571 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికి 1 గంట ముందుగా వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలి. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోము. ఈ విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనంలో ఉంచుకోవాలి.

అన్ని శాఖల సహకారం కోరాం

పరీక్షల నిర్వహణకు తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లుతో ఇప్పటికే సమన్వయ సమావేశాలు నిర్వహించాము. అన్ని శాఖల సహకారం కోరాం. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసేందుకు తగు సూచనలు చేశాం. తాగునీరు, శానిటేషన్, నిరంతర విద్యుత్తు సరఫరాపై సంబంధిత అధికారులను కోరాము. మెడికల్ శాఖ ద్వారా తగిన అత్యవసర మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ క్యాంపు ఏర్పాట్లపై సూచనలు చేశాం. రెవెన్యూ, పోలీసు శాఖ ద్వారా 144 సెక్షన్ అమలు, భద్రత, బందోబస్తుపై ఆదేశాలిచ్చాము.

జిల్లాల వారీగా కేంద్రాల ఏర్పాటు

తూర్పు గోదావరి జిల్లాలో 36 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశాం. రాజ మహేంద్రవరం డివిజన్లో 14,768 మంది, కొవ్వూరు డివిజన్లో 4,568 మంది మొత్తం 19,336 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. కాకినాడ జిల్లాలో 37 కేంద్రాల్లో 21,120 మంది, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 27 కేంద్రాల్లో 14,257 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 7 కేంద్రాల్లో 2,426 మంది విద్యార్థులు పరీక్షలకు హజరు కానున్నారు. ఈ జిల్లాలో మొత్తం 16 స్టోరేజ్ పాయింట్స్ ఏర్పాటు చేశాం.



నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది కేటాయింపు

సజావుగా పరీక్షల నిర్వహణ కోసం 196 మంది అధికారులు, సిబ్బందిని నియమించాం. జిల్లాలో మొత్తం 5 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 5 సిటింగ్ స్క్వాడ్స్ను నియమించాము. వీరు పరీక్షాకేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు.

పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - పెదపూడి

నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలందరికి పూర్తి స్థాయిలో తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. పెదపూడిలో రూ.11లక్షలతో కొత్తగా నిర్మాణం చేసిన బోరువెల్, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలం మండలంలోని గ్రామాల్లో సుమారు రూ.15 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో తాగునీటికి సంబంధించి పైపులైన్ల ఆధునికీకరణ, నూతన వాటర్ ట్యాంక్ల నిర్మాణం, ఇంటింటికి కుళాయి మొదలగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కేతా తులసి శ్రీనివాస్, మండల సర్పంచుల సమైక్య అధ్యక్షులు కోసూరి వాసు,ఎంపిటిసి సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, వైసిపి మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కాకర సాయిబాబు, కోరా వీర్రాజు చౌదరి, పార్టీ గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు పాల్గొన్నారు.


బోర్వెల్ ట్రాన్స్ఫార్మర్ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ సూర్యనారాయణ రెడ్డి

పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

కౌలు రైతుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కంటే వీరరాఘవ రావు అన్నారు. వడ్లమూరు లోని ఆర్బికెలో ఆదివారం కౌలు రైతులకు సిసిఆర్సిపై అవగా హన సదస్సు నిర్వహించారు. సిసిఆర్సి సర్టిఫికెట్ను ఉన్న కౌలు రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందేందుకు, ఇన్పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం తదితర సదుపాయాలు పొందగలుగు తారన్నారు. ఈ సర్టిఫికెట్ లేని కౌలు రైతులు రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదిస్తే ఈ కార్డుకు సంబంధించి సహాయ సహకారాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ అక్షయ్,మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్వి ప్రసాద్, అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీవాణి, కౌలు రైతులు పాల్గొన్నారు.


కౌలు రైతుల సదస్సులో మాట్లాడుతున్న వీర రాఘవరావు

చక్కని జీవనశైలితో ఆరోగ్యం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

సరైన పోషకాహారం తీసుకుంటూ రోజు శారీరక వ్యాయామం చేస్తూ చక్కని జీవనశైలిని అలవరచుకుంటే రోగాలు దరి చేరవని డాక్టర్ కుమార్ యాదవ్ తెలిపారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక ఆరోగ్యానికి ప్రోటీన్లు అధికంగా ఉండే బ్రౌన్ రైస్, చేపలు, పండ్లు, కూరగాయలు, పప్పు దినుసులతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవడంతో పాటు తగినంత నీటిని తాగాలని డాక్టర్ యాదవ్ తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో అడబాల రత్న ప్రసాద్, వాసిరెడ్డి శివ, బడే వెంకటకృష్ణ, అడబాల సత్యనారాయణ, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కుమార్యాదవ్

లయన్స్ కేబినెట్ సభ్యులకు 'అభ్యాస్'

ప్రజాశక్తి - తాళ్లరేవు

లయన్స్ జిల్లా 316 బి, 2023-2024 కేబినెట్ సభ్యులకు 'అభ్యాస్' తరగతులు తాళ్ళరేవు మండలం గోవలంక రిసార్ట్స్ లో నిర్వహించారు. లయన్స్ జిల్లా నూతన గవర్నర్గా ఎన్నిక కాబోయే లయన్ వేలూరి సూర్య నారాయణ (2023-2024), ఆయన కాబినెట్ సభ్యులు లయన్స్ ఇంటర్నేషనల్ లక్ష్యాల సాధనపై అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్లో నూతన సభ్యులను చేర్పించటం, నూతన క్లబ్లను ఏర్పాటుపై అవగాహన కల్పించారు, కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్పర్సన్ అనిల్ కుమార్ షేట్, బాదం బాలకృష్ణ, మంజులూరి విశ్వేశ్వరరావు, దాసరి తిరుమలరావు, ఇవివి ఈశ్వర్ కుమార్, వజ్రపు కోటేశ్వరరావు, వినోద్, దత్తు, చిట్నీడి శ్రీనివాస్, సతీష్, శ్రీనివాస్రెడ్డి, పెద్దిరెడ్డి ఉమా మహేశ్వరరావు, ధూళిపూడి బాబి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న లయన్స్ గవర్నర్ వేలూరి సూరిబాబు

పెద్దేవంలో వేధిస్తున్న డ్రెయినేజీ సమస్య

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఎంతోకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యను జగనన్నకు చెప్పినప్పటికీ దాని నిర్మూలన కోసం అధికారులు మాత్రం నిధులు లేవంటున్నారని మండలంలోని పెద్దేవం గ్రామ ఎస్సి కాలనీకి చెందిన ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ పరిధిలోని రెండు వార్డులు ఉన్న ఈ కాలనీలో ప్రజలు ఎంతోకాలంగా డ్రైనేజీ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎన్నిసార్లు సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమం ద్వారా తెలియజేశామన్నారు. అధికారులు వచ్చి దీన్ని పరిశీలించినప్పటికీ సమస్య నివారణకు నిధులు లేవనంటున్నారని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్య కారణంగా మురుగునీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో పాటు చిన్నపాటి వర్షం పడిన రోడ్డంతా నీటితో నిండి ఉంటోందని వాపోతున్నారు. ఈ సమస్య వల్ల దుర్వాసన పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆ ప్రాంత వాసి పెస్మా సంగం నాయకులు గెడ్డం విజయభాస్కర్ తెలిపారు. ఈ సమస్యను జగనన్న దృష్టికి తీసుకు వెళ్లడంతో సచివాలయ అధికారులు వచ్చి పరిశీలించి నిధులు లేవని చేతులు దులుపుకున్నారని అప్పటివరకు తమ పరిస్థితి ఇంతేనా అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పెద్దేవంలో రోడ్డుపై మురుగునీరు

సబ్ ప్లాన్ చట్టంపై ప్రచారోద్యమం

ప్రజాశక్తి - అమలాపురం

ఎస్సి, ఎస్టి సబ్ప్లాన్ చట్టంపై ఈ నెల 23 నుంచి ప్రచారోద్యమం నిర్వహించనున్నట్టు దళిత బహుజన మహిళ శక్తి కన్వీనర్ కొంకి రాజామణి తెలిపారు. ఈ మేరకు ముద్రించిన కరపత్రాలను ఆమె ఆదివారం డిబిఎంఎస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. సబ్ప్లాన్ నిధుల దారిమళ్లింపును ఆమె ఖండించారు. సబ్ప్లాన్ చట్టాన్ని శాశ్వత చట్టంగా చేసి ఎస్సి, ఎస్టిల అభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలనే డిమాండ్తో ప్రచార రథయాత్రను చేపడుతున్నామన్నారు. 23వ తేదీ ఉదయం 10.30 గంటలకు అమలాపురం గడియారస్తంభం సెంటర్ నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. 24న ముమ్మిడివరం, 25న పి.గన్నవరం, 26న కొత్తపేట, 27న రాజోలులో పర్యటిస్తుందన్నారు. రాజోలు ముగింపు సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎస్తేరు రాణి, జల్లి మహాలక్ష్మి, బొంతు నాగమణి, అంబటి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మహిళలు

కోతుల బెడదతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురంలో కోతుల బెడద అధికంగా ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పలువురు మాట్లాడుతూ గోపాలపురంలో మసీదు వెనుక, బస్టాండ్ సెంటర్లలో, శివాలయం వద్ద, ప్రభుత్వ కార్యాలయం వద్ద, ప్రభుత్వ పాఠశాలలు, పోస్ట్ ఆఫీస్, అనేక ప్రాంతాలలో తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇళ్లల్లోకి అవి చొరబడి, ఇళ్లను, వస్తువులను, వాహనాలను ధ్వంసం చేస్తున్నాయని, కరిచేందుకు మీదకు దూకుతున్నాయని, పిల్లలను గాయపరిచేందుకు వస్తున్నాయని వాపోతున్నారు. ఇళ్ల వద్ద ఉన్న అనేక వస్తువులను ధ్వంసం చేస్తున్నాయని, వాటికి కావలసినవి పట్టుకుని వెళ్ళిపోతున్నాయన్నారు. రోజురోజుకు కోతుల నుంచి అధిక మవుతున్నాయని తెలిపారు. కోతులు గ్రామంలో ఒక చొరబడి అటు ఇళ్లల్లోనూ, బస్టాండ్ లోను, గుడులు వద్ద కొబ్బరి చిప్పలు తినేందుకు ప్రభుత్వ కార్యాలయంలో కోతులు సంచరించడంతో వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. వస్తువులను ఎత్తుకు వెళ్ళిపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల నుండి సమస్య అధికంగా ఉందని చిన్నపిల్లలు, పెద్దలు పైన కోతులు గాయపరుస్తున్నాయని అన్నారు. సంబంధిత అధికారులు వాటిని అటవీ ప్రాంతంలోకి తరలించాలని కోరారు.



పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న కోతులు

మాజీ ఎంపిపి శ్రీరామ్జీకి పితృ వియోగం

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మాజీ ఎంపిపి నెక్కంటి శ్రీరామ్జీకి పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి నెక్కంటి శ్రీహరి(75) శనివారం రాజమండ్రిలో మృతి చెందారు. ఆయన ఏలూరు సిఆర్.రెడ్డి కళాశాలలో ప్రొఫెసర్గా పని చేశారు. సమాచారం తెలుసుకున్న పలువురు ప్రముఖులు కపిలేశ్వరపురంలోని శ్రీరాంజీ స్వగహానికి వచ్చి మృతుని శ్రీహరికి నివాళులర్పించారు. ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎంఎల్సి వివివిఎస్.చౌదరి, గంటి హరీష్మాథూర్, సర్పంచ్ సాకా శ్రీనివాస్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.


నెక్కంటి శ్రీహరి

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - యానాం

యానాం గౌతమీ గోదావరి నదిలో దూకి ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. కాకినాడ మాధవ పట్టణానికి చెందిన గుబ్బల శ్రీహరి ఆదివారం గోదావరిలో దూకడానికి ప్రయత్నించాడని వెంటనే పోలీసులు చూసి రక్షించారని తెలిపారు. అనంతరం అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్మన్ రామకృష్ణ

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి -మామిడికుదురు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించాలని ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ కోరారు. అప్పనపల్లి బాల బాలాజీ ఆలయ ఆవరణలో అటవీ శాఖ సమకూర్చిన మొక్కలను ఆదివారం భక్తులకు ఉచితంగా ఆయన పంపిణీ చేశారు.

అన్నదాన నిధికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

బాలబాలాజీ శాశ్వత అన్నదాన నిధికి అల్లవరం మండలానికి చెందిన పరమట అంజనేయులు, శశిరాణి దంపతులు రు.10,116లు విరాళం అందించారనికార్య నిర్వహణాధికారి డి.శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. దాత దంపతులకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాన్ని చైర్మన్ చిట్టూరి రామకృష్ణ అందచేశారు. ఈ సందర్భంగా దాతలను పలువురు అభినందించారు.